శ్రీ శారదాంబాయై నమః



శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

కీలక ఆశ్వయుజ కార్తికములు

సంపుటము 57 సంచిక 4

★

సంపాదకుడు

కవికంఠీరవ, కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర, విద్వత్కవివర, బ్రాహ్మీభూషణ

కాకరపర్తి కృష్ణశాస్త్రి

సంవత్సరమునకు చందా
రు. 3/—

విడిప్రతి
0–60 పైసలు

ఆంధ్రసాహిత్యపరిషత్తు

ప్రతిష్ఠాపకులు :

ఆంధ్రభోజ, మహారాజ,

శ్రీశ్రీశ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు.

వ్యవస్థాపకులు :

శ్రీ జయంతి రామయ్యగారు

ఉద్ధారకులు :

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు, జమీందారు, ఉయ్యూరు.

ఆంధ్రసాహిత్య పరిషత్తు (రిజిష్టర్డు)

కా కి నా డ

అధ్యక్షులు

విమర్శకాగ్రేసర, ఐతిహాసికసమ్రాట్

శ్రీ బండారు తమ్మయ్యగారు

ప్రధానకార్యదర్శి, కోశాధికారి

అభినవభోజ

శ్రీ దంటు భాస్కరరావుగారు

సహాయ కార్యదర్శి

కవిశిరోమణి, ఉభయభాషాప్రవీణ (A)

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు

కార్యనిర్వాహక సభ్యులు

1. శ్రీ కోకా శివనాథశాస్త్రిగారు
2. బాలవ్యాస, శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు
3. భాషాప్రవీణ, వ్యాకరణ విద్యాప్రవీణ
   శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు
4. కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర
   శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రిగారు
5. శ్రీ జయంతి బుచ్చిరామశర్మగారు
6. శ్రీ దామెర రాజగోపాలరావుగారు, బి. ఏ;
7. శ్రీ వేదుల రామచంద్ర కీర్తిగారు, ఎమ్. ఏ; (ఆనర్సు)
8. సాహిత్యవిద్యాప్రవీణ, ఉభయభాషాప్రవీణ
   శ్రీ ఓలేటి వెంకట సుబ్బరాయశాస్త్రిగారు
9. శ్రీ కావలి శ్రీరామమూర్తిగారు, బి. ఏ., బి. ఎల్;
10. శ్రీ నరసింహదేవర కృష్ణశాస్త్రిగారు
11. శ్రీ చిరువోలు వెంకట రామమూర్తిగారు

విషయసూచిక

కీలక — ఆశ్వయుజ కార్తికములు.

సంపుటము ౫౭ — సంచిక ౪

చంపకమాల

రచయిత్రి:- యన్. హైమవతి

చ. తెలుగుల కొక్క రాష్ట్రమును తీరిచిదిద్ది దివమ్ము చేరినా
రలఘులు నాయకాగ్రణు లవాస్కరమూర్తులు; మంత్రులైరి మా
న్యులు ప్రతిభాసమన్వితులు యోగ్యతకల్గిన దండనీతివే
త్తలు; లభియింపవే యిక ముదమ్ము శుభమ్ము యశమ్ము? బుద్ధిమం
తులకు ధరిత్రిలో కొదువ తోచ దటన్న నబద్ధమానె? ని
శ్చలతకు భూరిదిగ్విజయ సారసమాలిక యబ్బకుండునే?
సలలితపాలనాపటిమ శాశ్వతవైభవ మీయదే? దిసం
తుల విదళించి యాంధ్రుల కుతోభయులై తమవాంఛితమ్ములం
దెలుపుచు కేంద్రపాలకుల దృష్టిపథమ్మున నగ్రగాములై
గెలుపు లనేకముల్ గొని రకించనతన్ నశియింప జేయ, నా
కలను పరిత్యజించిరి, ప్రశస్తములౌ విమలాశయమ్ములన్
కలిగి పురోగమించిరి, ప్రణాళికలన్ విరచించి పేదసా
దలకు సురక్షితస్థితి సదా సమకూర్పగ నున్నతాధికా
రులు జరతాభిలాషలకు లోబడి నీతిని కావ శాసన
మ్ములు ప్రచరించి రందఱకుమోదము పంచగ నిశ్చయించి రీ
కలలు ఫలించునో? కుటిలకార్యసమర్థుల దుష్టవీక్షణ
మ్ములకు కలంగి దుష్ఫలితముల్ విరియించునో? స్వార్థపూరితుల్
కలతలు రేపుచుండిరి- సుగంధిజలమ్మును పంకిలమ్మునన్
చిలుకగ సాహసించు నవినీతిపరుల్ భరతోర్వి శత్రునే
తలకు దురంతవాదులకు దాన మొసర్ప తలంతు రయ్యయో !?
విలువ యెఱింగి త్యాగగుణవిశ్రుతులైన ప్రజాధినాథు లీ
తులువల ధూర్తవైఖరులు తుత్తునియల్ పొనరించి మాతృభూ
తలమును రత్నగర్భయన ధార్మికసుందరనందనమ్మనన్
మలతురు గాక! వేదమతమందసమీరము స్వేచ్ఛతో కెలం
కుల ప్రసరించుగాక నవకుందపరీమళ ముప్పతిల్లగన్.

ఆంధ్రశబ్దతత్త్వము: సంధిప్రకరణము

—శ్రీ రాళ్ళపల్లి సుందరం

క్రీ. శ. 1900 ప్రాంతమున మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో గీర్వాణబోధకులుగ నుండిన T. M. శేషగిరిశాస్త్రిగారు 'ఆంధ్రశబ్దతత్త్వము, అను తెలుఁగు వ్యాకరణమును రచించియున్నారు. ఇది వారి మనుమలు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి (జూనియర్) ముద్రించియున్నారు.

ఈ గ్రంథము రెండు భాగములుగ ముద్రింపబడి యున్నది. ఇందు ద్వితీయభాగమున అక్షరప్రకరణము, పదప్రకరణము, సంధిప్రకరణము- ఇత్యాది విభాగము లున్నవి. దీనిలో సుమారు ౨౦౦ సూత్రములు రచితములై యున్నవి. దీనిని సాకల్యదృష్టిలో పరిశీలించినపుడు పెక్కుసూత్రములు బాలవ్యాకరణసూత్రముల అనుకరణములై యున్నట్లు తెలియుచున్నది. శేషగిరిశాస్త్రిగారు తమ యాంగ్లోపోద్ఘాతమున 'The Gsrammars of all the Dravi dian Languages are more or less traditional and arbitary and even the sanskrit grammar o? panini is not free from this defect' అని నుడివియున్నారు. వీరు కొన్నియెడల తమిళమున గల మూలరూపము లొసఁగి యుండినను, వీరు రచించినసూత్రములు బాలవ్యాకరణమునం దున్నట్లు హితమితములై పొందికగా లేవు. వానిలో పెక్కు లవ్యాప్త్యతివ్యాప్తిదోషసహితములై యున్నవి.

చాల సందర్భములలో చిన్నయసూరిగారి సూత్రోదాహరణముల నాధారముగ గైకొనిన శాస్త్రిగారు కృతజ్ఞత తెలుపుటయటుంచి చిన్నయసూరి బాలవ్యాకరణమును తమ పూర్వభాగమున (క్రియాప్రకరణము) విమర్శించియున్నారు. వారు చెప్పినమాటలం గనుడు. "ఆదివైయాకరణు లయిన నన్నయభట్టారకుల వ్యాకరణమును ఆధారముగా గొని రచియింపబడినందున మూలగ్రంథమునం దుండుభ్రంశము లన్నియు వానియందు నున్నవి. నన్నయభట్టారకులే శబ్దస్వరూపములను జక్కఁగఁ దెలిసి కొనక బుద్ధికిఁ దోచినట్లు లక్షణ

ములను జెప్పినారు. వారు భ్రమించి చెప్పినవిషయములను ఇతర వైయాకరణులును ఒప్పులుగానే గ్రహించి తమతమ గ్రంథముల నొన రించినారు."

ఈ వ్యాసమున నేను చర్చింపఁదలచినది యే తద్గ్రంథాంతర్గత మగు (రెండవభాగము) సంధిప్రకరణము.

'సంధి యనఁగా రెండు అక్షరములను జేర్చి యుచ్చరించుట' (సూ 62)- ఇది వారి సంధినిర్వచనము. అచ్సంధుల గుఱించి వచిం చుచు వారు నిర్వచించినసూత్రము- 'అచ్చున అచ్చు పరం బగునపుడు న,య,ర,ఱ,వ లు బహుళంబుగా ఆగమంబులగు (సూ 66)- ఇందు ఉకారసంధిని గూర్చి చెప్పినసూత్రము.

౧. 'ఉత్తున కచ్చు పరం బగునపుడు లోపం బగు' (సూ. 76). ఈ సూత్రము పాక్షికము మాత్రమే. ఉత్తున కచ్చు పరంబగునపుడు లోప మని నంతనే సంధికరణలన్నియు స్ఫురింపవు కదా! "అచ్చు పరంబగునపుడు లోపంబగునని చెప్పుటచే బరమైనయచ్చు లోపించు ననెడి విపరీతార్థము స్ఫురించును. వాఁడు+ఏగెను=అనినపుడు జరుగు నవి రెండు కార్యములు. పూర్వపదాంతస్వరలోపము పరస్వరాదేశ ము, ఇప్పటిున సూరి 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు'నని సూత్రించి 'పూర్వాపరస్వరంబులను బరస్పరంబే కదేశంబగుట సంధి యనంబడు నని వివరించుట రమణీయము.

౨. 'అత్తునకు సంధి బహుళము' అను సూత్రమును శ్రమించి వివరణప్రాయముగ వీరు సూత్రించినవిధము గనుఁడు. 'అకారమునకు అచ్చు పరంబగునపుడు అకారమునకు లోపమును యకారాగమమును బహుళంబుగనగు (సూ 67). సూరి యొసఁగిన యుదాహరణములలో నిత్యవిధికి నుదాహరణములు లేవు. వీరుకూడ నొసఁగలేదు. సూరి యొసఁగిన మేన+అల్లుఁడు; పుట్టిన+ఇల్లు మాత్రమే యుదహరించిరి. సంధి జరుగదని వృత్తియందు సూరి వ్రాసినదానిని వేఱొకసూత్రముగ

శేషగిరిశాస్త్రిగారు రచించిరి. 'స్త్రీవాచకముల యొక్కయు తత్సమ సంబోధనాంతంబులయొక్కయు అంతాకారంబునకు లోపము లేదు.' (సూ. 68) అమ్మ+ఇచ్చెను. దూత+ఇతఁడు; ప్రియుండ+వగుము; ఉదహరించిరి. గంగనుకాసి, నెలలిచ్చెను, శ్రీరంగభర్తంచు మొదలగు ప్రయోగములనుగూర్చి వారేమియు వచింపలేదు. సూరి 'పూర్వకార్యములందు మృగ్యంబు' అని వ్రాసెను. కాని శ్రీ గిడుగు రామమూర్తిపంతులు 'బాలకవిశరణ్యము'న రెండు ప్రయోగములను జూపిరి. మాయ+అను = మాయను (రంగనాథరామాయణము); ప్రీత+అయి=ప్రేతయి (పద్మపురాణము). చిన్నయసూరి యథర్వణాచార్యులు చెప్పిన విషయమునైన నుట్టంగించిరి గాని, వీ రుపేక్షించిరి.

3. వీరిసూత్రములు కొన్ని, చిన్నయసూరి సూత్రములను వివరణప్రాయములు, 'ప్రథమావిభక్త్యంతములకు పరమయిన పరుషములకు గసడదవలు బహుళముగా నాదేశంబు లగును.' (సూ. 77). "తెనుఁగుపదములకంటె బరమయిన సంస్కృతపదంబులయం దుండు కచటతపలు గసడదవలు రావు' (సూ. 78) 'ద్వంద్వసమాసమునందు పూర్వపదాంతస్వరమునకు పరమయిన పరుషములకు గసడదవలు ఆదేశంబు లగును.' (సూ. 79) వ్యాకరణమున సూత్రములు వ్రాయుపద్ధతి యిది కాదు. ఈ సూత్రములకు సమములైన బాలవ్యాకరణసూత్రములను బరిశీలించినపు డిది తెల్లము గాకపోదు.

౪. బాలవ్యాకరణమున చిన్నయసూరి సంధి. ౧౬, ౧౭ సూత్రములలో చెప్పినదానిని వీ రొకేసూత్రమున వచించియున్నారు. 'ద్రుతప్రకృతికముయొక్క అంత్యనకారమునకు పరముగ వచ్చు పరుషములకు సరళంబులు ఆదేశంబులగు ఆదేశము లయిన సరళములకుముందు నకారమునకు సంశ్లేషమును అనుస్వారాదేశమును, స్వత్వంబును పాక్షికముగ నగును'. (సూ. 83). ఈ సూత్రనిర్మాణమునకును బాలవ్యాకరణసూత్రనిర్మాణమునకును గలభేదము నరయుఁడు.

వీరి సూత్రములకును, సూరిసూత్రములకును గలభేదము నరయుటకు పై యుదాహృతులు చాలును. వ్యర్థపదములు లేక, కంఠస్థము చేయుటకు తగినట్లుగను, నవ్యాప్త్యతివ్యాప్తిదోషము) లెక్కువ లేకుండగను రచియించుట యొక్కసూరికే చెల్లినది. చిన్నయసూరి సంస్కృతవ్యాకరణమర్యాద ననుసరించి వ్రాసినంతమాత్రమున బాలవ్యాకరణమును తీసివేయజాలము. శ్రీ శేషగిరిశాస్త్రిగారు తమ సంధిసూత్రములలో నెచ్చటను సంధికలిపినట్లు కనము, విసంధులే యెక్కువ. (ఉత్తుమీఁద, గూడ). వ్యాసములలో విసంధి తప్పలే దనుకొనినను, కనీసము సంధిపరిచ్ఛేదముననైన విసంధి విసర్జనీయ మని నా తలపు. తెలుఁగుపదములకు గొన్నిటికి తమిళమూలరూపమున నరయుటకు నీ గ్రంథ ముపయోగించును.

గాధేయచరితమ్ - ప్రథమః సర్గః

శ్రీ దురిశేటి వేంకటరామాచార్యః

(గ్రీష్మరంచికానంతరమ్)

అవిశ్రాంతం రాజకార్యవ్యాపృతేన దివానిశమ్
మానసే నాథ రాజానం రంజయన్ మధు రాగతః. 61
అవచిక్యే పాండురాణి పత్రాణి శిశిర స్తరా
తత్రై వాయం మధూ రక్తం పల్లవం పర్యధాపయత్. 62
ప్రాహిణో న్మధు రాత్మీయం మిత్రం మలయమారుతమ్
యోఽలం పల్లవితం కర్తుం రాగా త్తరుణయో ర్మనః. 63
యూనాం మన స్యింగితాని విడంబయితుకామయా
జ్యోతిష్మత్యా హి లతయా ధృతా భంగాః పయోముచామ్. 64
ప్రతిద్రుమం ప్రతిలతం పల్లవం సమజాయత
రక్తం పల్లవితం యూనా మివాభినవ మున్మనః. 65
పుష్పవత్యా రజోమత్యో లతా రామా ఇవాఖిలాః
అనుక్షణం విచరతాం మధుపానాం సుఖప్రదాః 66

ఖండితామానసాఖర్వ గర్వనిర్వాపణక్షమమ్
అరవిందం వికసితం యశ స్తస్యైవ భూభృతః. 67

వినాశోకః కుసుమితో యువతిపాదతాడనమ్
ప్రియస్య పాదపతనం వినైవ ముదితా హి సా. 68

చూతం ప్రసూనం ధృతవాన్ రామాయావనయావనమ్
మధునః కలకంఠస్య కలకంఠస్య కారణమ్. 69

నవమల్లీ సుమవ్యాజా ద్ధసంతీ మాం రుషా యుతామ్
ఇతి మత్వేవ తరుణీ ప్రణయే నైక్షత ప్రియమ్. 70

నీలోత్పలాని యువతీనయనాని చ రేజిరే
పరస్పరతులాం ప్రాప్య దిదృక్షూణాం మనోహరమ్. 71

శుకైః పికైః శారికై శ్చేందిందిరై రిక్షుధన్వినా
పంచబాణైః సమాయాతః సన్నద్ధో మకరధ్వజః. 72

తథావిధే మధౌ తత్ర యువాన స్తరుణీసఖాః
రమన్తే స్మావినాభావం వనే ష్వావసనేషు చ. 73

దివి నిర్గతమేఘాయాం చిత్రయా సహితః శశీ
భువి ప్రఫుల్లపుష్పాయాం రేజేఽసౌ మహిషీసఖః. 74

కుముదా న్యక్షిణి పౌరాణాం నిష్కలంకో దివానిశమ్
వికాసయ న్నయం రాజా రరా జాక్షయవృద్ధిమాన్. 74

యథా మధౌ తథా శ్రీమాం త్సహదారః సహాప్రజః
సర్వే ష్వృతు ష్వసౌ తం త మార్తవం సుఖ మన్వభూత్. 76

శరదాం శతా న్యనేకాని నమయన్ శత్రుసూదనః
శతం పుత్రా న్నాప రాజా సర్వధాత్మగుణాన్వితాన్. 77

ఇతి శైలోరగరాజకచ్ఛపదిశాకుంభీంద్రసారే భుజే
చతురంభోనిధిమేఖలాం సదనదీహారాం భువం లాలయన్
తతనీహారపటీరభాసురయశఃపూరై ర్హిమక్ష్మాధర
స్థితసర్వజ్ఞశిరఃకలాం ధవలయన్ రాజా శశాస ప్రజాః. 78

ఇతి

ప్రథమః సర్గః.

బట్టుమూర్తి - మూర్తికవి

శ్రీ చేకుమళ్ల కామేశ్వరరావు, బి. ఏ. బి. ఇడి.,

తెలుఁగు వాఙ్మయములో ప్రఖ్యాతి చెందినకవులలో రామరాజభూషణుఁ డొకఁడు. అతఁడు ప్రాచీనకవి గాక మధ్యయుగపువాఁడు. అయినను అతనినిగుఱించి కొన్నిసమస్య లున్నవి. అతని బిరుదనామము రామరాజభూషణుఁ డగుటచేత, తలిదండ్రులు పెట్టినపే రేమి ? అదే మొదటిసమస్య. దానికి ముందుగా, అతని స్వస్థల మే మనున దొక ప్రశ్న. అవి యట్లుండగా, మూర్తికవి యనున దతని సొంతపే రనియు, రామరాజభూషణుఁ డనునది బిరు దనియు హేమాహేమీలుగూడ చెప్పుచున్నారు. వీటి నిజానిజములు తీవ్రపరిశోధనను గోరుచున్నవి; త్రివ్వి చూచెదము.

రామరాజభూషణుఁడు వసుచరిత్ర, హరిశ్చంద్రనలోపాఖ్యాన ప్రబంధముల కర్త కాగా; మూర్తికవిపేర నరసభూపాలీయ మను కావ్యాలంకారసంగ్రహ మున్నది. అది యొక శాస్త్రకావ్యము.

ఆ పద్యగ్రంథముల గద్యము లిట్లున్నవి—

1. "ఇది శ్రీరామచంద్ర చరణారవిందవందన, పవననందన ప్రసాదసమాసాదిత, సంస్కృతాంధ్ర భాషాసామ్రాజ్య సర్వంకష, చతుర్విధకవితానిర్వాహక, సాహిత్యరసపోషణ, రామరాజభూషణ ప్రణీతంబైన వసుచరిత్రంబునందు"-

2. గద్య మంతయు పై దానివలె నుండి కడపట పుస్తకముపేరు మాత్రము "హరిశ్చంద్రనలోపాఖ్యానంబు" అని యున్నది.

3. "ఇది శ్రీ హనుమత్ప్రసాదలబ్ధ, కవితాసార, సారస్వతాలంకార, నిరంకుశప్రతిభాధురంధర, ప్రబంధపరనరచనాధురంధర, ప్రబంధాంక వేంకటరాయభూషణానుపుత్ర, తిమ్మరాజపౌత్ర, సకలభాషావిశేష, నిరుపమావధాన, శారదామూర్తి, మూర్తిప్రణీతం బైన కావ్యాలంకారసంగ్రహంబును-

ఆ గ్రంథత్రయములోని చారిత్రకాంశములను క్రమముగాఁ బరీక్షించెదము. అనాటిచరిత్రను సాకల్యముగా నెఱుఁగకుండ విమర్శకుఁ బూనుకొనుట, మార్గమెఱుగకుండ అడవిలోకి దూరుటవంటిది. కాబట్టి సమకాలచరిత్రను తెలుసుకొనెదము.

1. కృష్ణదేవరాయల కడపటిరోజులు.

దక్షిణహిందూసామ్రాజ్యము కృష్ణదేవరాయల నాడు అత్యున్నతదశలో నుండినది. ఆ మహారాజునకు నిద్దఱు కూతుండ్రు, ఒక కుమారుఁడు. కుమారుఁ డైనతిరుమలరాయల వృద్ధిని గుఱించి యామహారాజు కలలుగన్నాడు. కాని విధి వేఱుగా నున్నది. ఆ బాలుఁడు పసితనములోనె మరణించినాడు. కృష్ణరాయలకు మతిపోయిన ట్లైనది. కొన్నిటిలో ప్రవర్తింపకూడని విధముగా ప్రవర్తించినాడు.

అతని పెద్దకుమార్తె యైన తిరుమలాంబ ఆర్వీటిరామరాయల భార్య. అతఁడే అళియరామరాయలు. అతనివయస్సెంత ? అతనికి 1565 నాటికి తొంబదియారు సంవత్సరము లని యొకసిద్ధాంతము. అప్పటికి నాతనిజన్మ క్రీ. శ. 1469 యగును. కృష్ణదేవరాయల జననము క్రీ. శ. 1487 అని కొంద అనుచున్నారు. కాబట్టి మామగారికంటె అల్లుఁడు పెద్దవాఁ డగును. అది సబబుగా గనఁబడదు కదా! 1565 నాటి తల్లికోటయుద్ధములో రామరాజు మరణించెను. అప్పటికి అతనివయస్సు 65 అని భావించినయెడల, అతని జననము క్రీ. శ. 1500 అగును. అతనికంటె చిన్నవాడు అతనితమ్ముడు తిరుమలరాయలు. అతనిజన్మ క్రీ. శ. 1505 అని తలవ వచ్చును. కృష్ణరాయల రెండవ కుమార్తె పేరు కృష్ణాంబ. ఆమెయొక్క భర్త మట్లవరదరాజు.

రామరాజు తమ్ముఁ డైనతిరుమలదేవరాయఁడె రామరాజభూషణుఁడు రచించిన వసుచరిత్ర ప్రబంధమునకు కృతిపతి.

విజయనగరసామ్రాజ్యవిచ్ఛిన్నకరశక్తులు కొన్ని కృష్ణదేవరాయని కాలములోనె తల లెత్తినవి. అది బహువిచారకరము. ఆనాటి [1]కొన్ని శాసనములలోని ప్రశస్తులను జూచెదము. (శకసంఖ్యకు ప్రక్కనె క్రీస్తుశక సంఖ్యనుగూడ తెలియజేసినాను.)

1. ...స్వస్తిశ్రీ...శక 1448 (క్రీ. శ. 1526)...శ్రీ మద్రాజాధిరాజ, రాజకంఠీరవ, రాజకందర్ప, మహారాజాధిరాజపరమేశ్వర రాజపూజితు లగు మహారాజశ్రీ రామరాజయ్యగారు విజయనగర సింహాసనమున పృథ్వీసామ్రాజ్యము చేయుచుండగాను...

2. స్వస్తిశ్రీ శక 1446 (క్రీ. శ. 1524)...శ్రీమాన్ మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, శ్రీవీరభుజబలప్రతాపగజపతి, అశ్వపతి భాడ శ్రీకృష్ణదేవమహారాయ ఉదరాబ్ధిచంద్ర శ్రీ తిరుమలదేవమహారాయన...

3. [2]అచ్యుతదేవమహారాయలువారు విజయనగరమందు వజ్రసింహాసనారూఢులై......

పైవారి శాసనములు మఱికొన్నిగూడ నల్లై యున్నవి. తిరుమలుని శాసనము మఱియొకటి ఆ సంవత్సరముదే యున్నది. అచ్యుతుని క్రీ. శ. 1528, 1529 నాటివి యున్నవి.

పైనఁ జూపిన అళియరామరాయుల, తిరుమలదేవరాయల, అచ్యుతరాయల శాసనములను జూచి చరిత్రపరిశోధకులు, కృష్ణదేవరాయలు మరణించియుండుటచేత, వారు మహారాజులైరని తలచుచు, కృష్ణదేవరాయలరయొక్క మరికొన్ని శాసనములను బరిశీలించి, ఇంకను

---

1. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారి లక్ష్యరాయవ్యాసావళి (1923) పుటలు 49,50 (ఆ వ్యాసము చాలవఱకు ఆంధ్రకవి తరంగిణి సం 7 పు 173-179 లో పునర్ముద్రితము.)

2. తిరుమగల శాసనభాగము చెడిపోయినది. అయితే మఱికొన్ని శాసనములును, లక్ష్మణరావుగారి యభిప్రాయముతో నేకీభవించు వ్యాసము ఆంధ్రేతిహాస పరిశోధకమండలి భా 1 పుట 58 లో నున్నది.

అతఁడు బ్రతికే యున్నాఁడని విశ్వసించుచున్నారు. అట్లు రాజధానిలో బహు మహారాజులును, చక్రవర్తులును బయలుదేరిరి. వీరికె వ్వరు పట్టాభిషేకము చేసిరి? అవి అక్రమశక్తులు మాత్రమె. కాఁబట్టి బిరుదములను జూచి చెప్పలేనిదుస్థితి యేర్పడినది. అట్లు కృష్ణరాయలనాఁడె బహునాయకత్వము మొలకెత్తినది. పోనుపోను అది ముదిరి సామ్రాజ్యలయము నెట్లు నాశనము చేసినదో క్రమముగా జూచెదము.

ఆర్వీటి అళియరామరాయలకు మొదటినుండియు పెనుగొండయె పట్టుగొమ్మ. అతఁడు పెనుగొండకు రాజని 1526 నాటి[3] యొక శాసనములోఁ జెప్పబడినది.

2. సామ్రాజ్య జీర్ణదశ

కృష్ణదేవరాయుని యనంతరము అచ్యుతదేవరాయలు (క్రీ. శ. 1530-42) సామ్రాజ్య పరిపాలకుఁడాయెను. అతఁడు వివేకశూన్యుఁడు. విజాపురము సుల్తానైన ఇస్మాయిల్ ఆదిల్‌షాహా 1531 లో రాయచూరు, ముద్గలుకోటలను వశపఱచుకొన్నాడు. అంతేకాక అచ్యుతరాయలే తనరాజ్యములోని యంతఃకలహములను అడ్డగించుటకోసము, ఆదిల్‌షాహా సాయమును గోరి, అతనికి గొప్ప బహుమానముల నిచ్చెను. గోల్కొండనవాబైన కులీకుతుబ్‌షా కొండవీటిని జయించినాడు. ఇస్మాయిల్ యొక్క కొడుకైన ఇబ్రాహిం ఆదిల్‌షాహా హొస పేటను (నాగలాపురము) నాశనముచేసి, విజయనగరముమీఁదికి దండెత్తగా (1535-36), అచ్యుతరాయలు అతనికి పెద్దలంచమిచ్చెను. కాని యతఁడు వదలక ఆదోనికోటను జయించెను. అంతట రామరాయలు ఆదోనిని విడిపించుటకోసము తన తమ్ముఁడైన వెంకటాద్రినిఁ బంపెను. [4]కాని యతఁడు ఓడిపోయి తిరిగి వచ్చినాడు. అట్టి పరిస్థితులలో శత్రువులు పెనుగొండ, గుత్తి, కర్నూలులనుగూడ నాక్రమించుకొనిరి.

3. ఆంధ్రకవి తరంగిణి (చాగంటి శేషయ్యగారు రచించినది) సం 7-179.
4. ఆంధ్రేతిహాసపరిశోధకమండలి సం 17-187

అచ్యుతరాయలు నిర్వీర్యుఁడై యుండగా రాజధానిలో రెండు కక్షలు బయలుదేరినవి. అతని బావమఱదియైన సలకము చిన తిమ్మయ్యది ఒకటి. అళియరామరాజుది రెండవది. వారిద్దఱును ఎత్తుపైయెత్తు వేయుచుండిరి. ఇది అంతరంగికా శాంతి.

పడమటితీరమునన్నున్న పోర్చుగీసువారు వర్తకముకోసము కోటలను గట్టుకొనిరి. తిరుపతిలోని ఖజానాను కొల్లగొట్టుటకోసము నౌకాదళమును తయారుచేసిరి. (క్రీ. శ. 1545). కాని కారణాంతరములవల్ల నది కొనసాగలేదు. దానికి బదులుగా కొన్ని దేవాలయములను కొల్లగొట్టి ధ్వంసముచేసిరి.

విజయనగరసంస్థానము కడు హీనస్థితిలో నుండినది. అంతశ్శత్రువులు, బహిశ్శత్రువులు మిక్కుటమైనారు. రాజధానిలో నందఱును గొప్పరాజులే. రాజాస్థానము ఆడమళయాళముగా నుండినది. భోగస్త్రీలు, వారి యాటపాటలు, అవినీతి విచ్చలవిడిగా నుండినవి.[5] అచ్యుతరాయల అంతఃపురములో యేబదివేలమంది పరిచారకులు. అతని భార్యలు అయిదువందలమంది! ఇంకను అనేకరకములైన ఆడపటాలమున్నది! పరిపాలకులలో శైవభక్తి తగ్గి వైష్ణవము ముదిరినది. కవులకు ఆత్మగౌరవము పూజ్యమైనది. కొందఱు కవులకు నామధారణ మవసరమైనది. ఆనాటి హీనదశను తలచుకొని [5a]బైచరాజు వెంటనాథుఁడిట్లు విలపించినాడు—

ఆ. వె. వెల్లివిరిసె పెంటివిద్యలు; మగవిద్య
లడుగువట్టి, కిం్రదువడిరి బుధులు;
హీనజాతి పురుషులెచ్చిరి; యాచింప
బోవు టెట్లు నేటి భూమిపతుల? (పంచతంత్రము 2-132)

---

5. మహమ్మదీయ మహాయుగము (కొమర్రాజు లక్ష్మణరావుగారు) పుట 888.

5ఏ. వెంకటనాథకవి 1550-60 మధ్య పంచతంత్రికావ్యము నిర్మించినాడని చిలుకూరి నారాయణరావుగారి యభిప్రాయము (భారతి 1941 జూన్. పు 630). కాని యతఁడు ఇంకను పూర్వపువాడని చెప్పెడి యైతిహ్యములున్నవి.

అళియరామరాయలు సామ్రాజ్యము నుద్ధరింపఁ బద్ధకంకణుఁడై నాఁడు. అతని సామ్రాజ్యోద్ధరణను తెలుసికొనవలసియున్నది.

విజయనగరరాజ్యము దుర్గతియట్లుండగా "[6]తళ్ళికోటయుద్ధము నకు (క్రీ. శ. 1565) ముందుఁ గర్ణాటకరాజ్యము క్షీణింపలేదు, పున రుద్ధరణమేల?" అని వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిలుగారు ప్రశ్నించుచున్నారు. అట్టి దురభిప్రాయమె విమర్శకులను తప్పుదారి పట్టించినది; వసుచరిత్ర గ్రంథరచనాకాల నిర్ణయమును చెడగొట్టి నది.

3. ఉద్ధరణ ప్రారంభము

1542 లో అచ్యుతదేవరాయలు మరణించి సుఖపడినాడు. అతని కుమారుఁడు వెంకటాద్రి పసివాఁడు. అతని మేనమామ సలకము చిన తిమ్మరాజు ఆ పసిబాలుని తొలగించి, సింహాసనము నాక్రమించు కొనఁ దలపెట్టినాడు. కాని ఆ బిడ్డని తల్లియు, చిన తిమ్మరాజు సోద రియు నగు వరదాంబ యా దౌష్ట్యమున కంగీకరింపలేదు. ఆమె బిజా పురపు సుల్తాన్ యొక్క సహాయమును కోరినది. రాజధానిలో నమ్మ కస్తులు లేరని కాఁబోలు ఆమె యూహా. అయితే సుల్తాన్ సేనలను చిన తిమ్మరాజు ఎదిరించి, యోడించినాడు. సింహాసనము నధిష్ఠించి నాడు. పిమ్మట మేనల్లుని తుదముట్టించినాడు! అతిఘోరము!

అట్లు అసలు హక్కుదారుఁడు అంతరించగా, అళియరామరాజు తన హక్కును ప్రకటింపఁదలచుకొన్నాడు. తన పట్టాభిషేకమును గోరి కార్యరంగములోకి దూకినాడు. దానిలో చిక్కులు బోధపడినవి.

పెనుగొండ, ఆదవాని, గుత్తి మొదలైన దుర్గములు నవాబుల చేతులలో నున్నవి. విజయనగరములోని పరిస్థితులు విషమించితే, రామరాజునకు పారిపోవుటకొక రక్షణస్థాన ముండవలెను. తనకు అది

---

6. వసుచరిత్ర విమర్శనము (వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రిలుగారు వ్రాసినది) 1915, పుట 118.

వలెను ఆశ్రియముగా నుండిన పెనుగొండ పరిహితఖాన్ అనువాని చేతులలో నున్నది. దానిని విడిపింపవలెను. ఆ ఖాన్‌ను అక్కడినుండి తరమగొట్టవలెను. రామరాజు, తన సోదరుల సహాయముతో పెనుగొండ, ఆదవానిదుర్గముల నెదిరించి వశపఱచుకొన్నాడు. అట్టితయారీ సలకము చినతిమ్మయతో యుద్ధము కొసమె. అయితే సలకము నెదిరించుట ముందా లేక పై కోటలను విడిపించుట ముందా యను చర్చ లేకపోలేదు. ఆనాటి కవులు అప్పటి ఘటనల నెట్లు వర్ణించిరో చూచెదము.

అందుగుల వెంకయకవి (క్రీ. శ. 1680) రామరాజీయమను నరపతివిజయప్రబంధములో నిట్లు వ్రాసినాడు.

గీ. అవని నిలువలెఁ బుత్రపౌత్రాభివృద్ధి
రహిని వర్ధిల్లు తిరుమల రాయ వేంక
టాద్రి రాజానుజద్వయ మధికభక్తి
గొలువ నళిరామ భూపాలుఁ డలరుమిగుల.

(ప. 278)

గీ. సకలవిభు తిమ్మరాజుసేనలను దునించి
గుత్తిఁబెనుకొండ, మఱి గండికోట, గండ
నోలుపుర, మాదవని నవలగెలిచి,
తోలుదోలుత రామనృపు దోర్బలము మెఱసె. (ప 278)

రామరాజునకు 'పెనుగొండ దుర్గసాధకుఁడు', 'ఆదవేని దుర్గపహారణుఁడు'ను బిరుదులున్నవని యీ గ్రంథములోఁ దెలుపఁబడినది గుత్తిదుర్గములో సదాశివరాయలు బంధింపబడియుండగా, రామరాయ లాతనిని విడిపించి, తనవెంటఁ బెట్టుకొన్నాడు.

వసుచరిత్ర కర్త రచన శ్లేషతోఁ గూడినది. అట్టి రచనలో నన్నిదుర్గముల పేళ్లిముడవు. కాఁబట్టి యతఁడు పెనుగొండ, ఆదవని విజయములను మాత్రమె యిట్లు తెలిపినాడు-

సీ. పట్టాభిషేక విపర్యయంబునఁ బోలు
వెడలిపిరియానుజుల్ వెంటగొలువఁ
జిత్రకూటాభిఖ్యఁ జెలఁగు పెనగొండ, సాం
ద్రిహరి ద్విపేంద్రనాదవనిఁజెంది,
ఖలజనస్థానవాసుల బల్వ్యగవధించి
మహిఁ దు సకలఖరస్మయమడంచి (ఆ 1-43).

రాముని యర్థమును విడిచి రామరాజు పరమైన యర్థమును జూడ వలసియున్నది. రామరాజు తాను దలపెట్టిన తన పట్టాభిషేకము విఫలమైనది. సోదరులతోఁ గూడి పెనుగొండ, ఆదవానిదుర్గములఁ గెల్చుకొన్నాడు. ఖలులస్థానము ఆనాటి విజయనగరము. సకలము వాని పక్షమున నున్నవారు ఖలులు. చిన తిమ్మయ్యను ధ్వంసము చేసినారు.

రామరాజు రంగపరాజకవి 1550 ప్రాంతములో సాంబోపాఖ్యానప్రబంధమును రచించినాడు. దానిలో అళియరామరాజు-

మ. మహినెవ్వారెన సల్కరాజు చిన తిమ్మక్ష్మాపకంతారుణాం
బుహావిశ్చర్వణ తర్పితాసిశిఖిం, ♦ ♦ ♦
గర్ణాటకైశ్వర్య నిర్వహణా రార్య భుజధ్వజాయుధపరీ
వారుండు రామప్పకున్.

అని స్తుతింపఁబడినాడు.

[6a] రత్నాకర గోపాలకవి (క్రీ. శ. 1550 ప్రాంతము.)

[6b] సౌగంధికాప్రసవాపహరణమను ద్విపదకావ్యమును సృష్టించి రావెళ్ల రెండవలింగకవి తండ్రియైన అయ్యపనాయకుఁడు అళియరామరాయని తలలోని మానికమట! లింగన "పెనుగొండకు దోవలు

6ఏ. శొందూరి ఈశ్వరదత్తుగారు ఆ. సా. ప. ప. సం 25-6 లో సౌగంధికాప్రసవాపహరణము, ఆంధ్రేతిహాసపరిశోధకమండలి సం 10 పు 222-224 నను వ్యాసములు వ్రాసిరి.

6బి. అదే పేరుగల సంస్కృతగ్రంథ వెంకటి విశ్వనాథునిచే రచింపఁబడినది. ఆ. సా. ప. ప. సం 25-255.

చూపినవాడు; ఆదవాని దుర్గాపహరణుఁడు". అట్లు తండ్రి కొడుకులు యుద్ధములలో సాయపడినారు.

రామరాయలు అంతటితో నూరుకొనక, తన సోదరుఁడైన దిరుమలరాయునికి పెనుగొండలో (1542-43) పట్టాభిషేక మొనర్చినాడు. వాని కుమారుఁడైన శ్రీరంగరాయలు యువరాజైనాడు (వసు ఆ 1-77). అది ప్రిధానముగా రాజకీయతంత్రము. సలకము చిన తిమ్మయ్య ముఖ్యపట్టణములో సింహాసనాసీనుఁడు కాగా, రామరాయలు పోటిప్రిభుత్వము స్థాపించినట్లుగా తిరుమలరాయునికి పట్టాభిషేకము చేసినాడు. (ఆ 1-52). దానిని స్థానికపట్టాభిషేకముగానైనను భావించి సంతోషింపవచ్చును. అవసరమైన సహాయము పెనుగొండ నుండి పొందవచ్చును. అదంతయు ముందు జరుగబోయెడి కార్యమునకు పూర్వరంగము.

రామరాజు తన బలగముయొక్క సాయమును గోరినాడు. విజయనగరమును చేరుకొన్నాడు. సలకము వానిమీద ధ్వజమెత్తి, హతమార్చినాడు. అట్లు రామరాజు జయము పొందినాడు. కాని సింహాసనముమీద ఆశను విడిచినాడు. సదాశివరాయలను గూర్చుండఁ బెట్టినాడు. తాను జీవితాంతము వఱకునుమహాప్రిధాని, నియంతపదవులను మాత్రిమె చేఁబట్టినాడు.\ ఆనాటి కవుల వాగ్ధోరణి నిఁక జూచెదము-

నరసభూపాలీయకవి-

సీ. ఖలునతిద్రోహి సల్కయతిమ్మనిహరించి,
సకలకర్ణాటదేశంబు నిలిపె

♦ ♦ ♦

గీ. అవనియంతయు రామరాజ్యంబు సేసె

♦ ♦ ♦

భూమి నొకరాజ మాత్రిండె రామవిభుఁడు

(నరస ఆ 1-82)

క్రీ. శ. 1550 ప్రాంతములో పద్యభాగవతమును వ్రాసిన దోనూరి కోనేరుకవి-

ఉ........విద్యాపురియందు జాలఘనుఁడయ్యె సదాశివరాజ్య సం
స్థాపకుఁడై సిరంగ వసుధావరు రామనరేంద్రుఁడున్నతిన్.

అని పలికినాడు. ఇప్పుడు మఱియొక ముఖ్యప్రశ్ననుఁ జూచెదము.

4. పేరు

కొందఱు విమర్శకులు తిరుమలరాయని పేరులోని భేదమును పెద్దదిచేసి, కాలనిర్ణయమున కదియొక సాధనమనుకొనుచున్నారు. నరసభూపాలీయకవి తిరుమలరాయనిని ఎఱతిమ్మరాజు (నరస 1-84) అని పేర్కొన్నాడు. అట్లె సాంబోపాఖ్యానకవి యీతనిని "గుత్తెఱ తిమ్మరాజన్నాడు. తిరుమలరాయఁడు సింహాసనారూఢుఁడుగాక పూర్వము ఎఱతిమ్మరాజుగానుండి, సింహాసన మెక్కినపిదప తిరుమలరాయ నామధారియైనాడని [6]కొందఱు భ్రమపడి, రాయలు అను పదము కాలనిర్ణయమున కనుకూలముగా నున్నదని సంతోషపడుచున్నారు. అది వ్యర్థము. మహాఘనుఁడైన అళియరామరాజులు 'రామప్ప' యనియె సాంబోపాఖ్యానములోఁ బిలువఁబడియుండుటను మనము చూచితిమికదా! కాఁబట్టి పేరు కాలనిర్ణయమునకు తోడ్పడుట లేదు. వారి వంశములో తిమ్మరాజు లిద్దఱున్నారు, ఒకఁడు నల్లతిమ్మరాజు, మఱియొకఁడు ఎఱ్ఱతిమ్మరాజు. కవులు ఆ పేర్లను ఇష్టమువచ్చినట్లుగా వాడుచుండిరి. అంతే.

౫. పట్టాభిషేకము

తిరుమలరాయనికి నెప్పుడు పట్టాభిషేకమైనది యనునది బహు ముఖ్యమైన ప్రశ్న. దానిమీఁద నాధారపడియె విమర్శకులు వసుచరిత్ర రచనాకాలమును నిర్ణయించుచున్నారు. తిరుమలరాయనికి పట్టాభిషేక

6సి. ఆంధ్రేతిహాసపరిశోధకమండలి సం 8-3 పు 243.

మైనట్లుగా వసుచరిత్రకారుఁడు వ్రాసినాడు. (ఆ 1-62). అయితే అది యెప్పుడు? రామరాజు పెనుగొండను జయించినవెంటనె రాజకీయపు టెత్తుగా 1543 లో తన తమ్మునికి పెనుగొండయందె పట్టాభిషేకము గావించినాడు. సదా శివరాయలు సామ్రాజ్యమునకు చక్రవర్తి కదా!

వసుచరిత్రలోని పై పద్యమునందు, తళ్ళికోట (1565) యుద్ధానంతరము తిరుమలరాయలు విజయనగరరాజ్యమున కంతకును పట్టాభిషేకము చేసుకొన్నాడని కొందఱు విమర్శకులు వాదించుచున్నారు. అది నిజమా? ఆ యుద్ధమునకు పిమ్మట తిరుమలరాయఁడు సదాశివరాయలను వెంటబెట్టుకొనియె తిరుగుచుండెను. సదాశివరాయలు చక్రవర్తియని యెల్లరెఱుఁగుదురు. ఇంక తిరుమలరాయని కేమి పట్టాభిషేకము? సదాశివరాయల మరణమునకుఁ బిమ్మట తిరుమలరాయలు విజయనగర రాజ్యాధిపతి యయ్యెనని యెవ్వరైన వాదనకుఁ బూనుకొనవచ్చును. కాని దానికిగూడ నొకపెద్ద యభ్యంతరమున్నది. సదాశివరాయలు క్రీ. శ. 1586 దాక బ్రతికియున్నట్లు[7] శాసనములున్నవి. తిరుమలరాయఁడు క్రీ. శ. 1575 నాటికె మరణించినట్లుగాఁ గనబడుచున్నది. కాబట్టి అట్టి యవకాశముగూడ లేదు. అందుచేత తిరుమలరాయని స్థానికపట్టాభిషేకము 1543 లోనె జరిగినదని నిశ్చయమగుచున్నది.

6. జీర్ణోద్ధరణము

అళియరామరాయలు రాజ్యములో గొంత స్థిమితిని స్థాపించినాడు. ఇంక బహిశ్శత్రువుల నెదుర్కొనవలెను.

1543 లో అతఁడు, విజాపురసుల్తానును వశపఱచుగొన్న ముదిగల్లు. రాచూరుదుర్గములను గెల్చుకొన్నాడు.

అతని సోదరుఁడగు వెంకటాద్రి అదే రాజ్యములోనిదగు కృష్ణాతుంగభద్రల మధ్యదగు అంతర్వేదిని వశపఱచుకొన్నాడు.[8]

---

7. ఎపిగ్రాఫికా ఇండికా 4-273 (వసుచరిత్ర విమర్శనము పుట 133).

8. జీర్ణవిజయనగరచరిత్రము (కంమూరి ఈశ్వరదత్తుకృతము 1927) పు 200.

సీ. పదిలుఁడై రాచూరుముదగల్లు గప్పంబు
సేయఁగాంచ, సపాదసీమ నిలిపె

♦ ♦ ♦

గీ.............రామవిభుఁడు,

(నరసభూపాలీయము ఆ 1-82)

రామరాజు, అతని బృందము గలిసి నవాబుల బలమును గౌత మియవతలకు (వసు. ఆ 1-54) గెంటివేసినారు.

తిరుమలరాయల కొడుకైన శ్రీరంగరాజు చాల సహాయపడి నాడు. అతఁడు కుంతల, లాట, వత్స, కాంచి, అంగ దేశములను (వసు. 1-73) జయించినాడు. మఱియొక కొడుకైన రామనృపాలుఁడు శ్రీరంగ పట్టణమును (వసు. 1-77) జయించినాడు. ఇంకొక పుత్త్రుఁడైన వెంకటరాయలు (వసు 1-81) చంద్రగిరికోట రక్షణకు నియమింపఁబడి నాడు. అప్పటి తిరుమలరాయలయొక్క యుచ్చదశ (వసు 1-15) యెట్లు వర్ణింపఁబడినది- గజపతిగజములను, అశ్వపతి అశ్వములను, నావాడపతి గండపెండేరములను, పాండ్యరాజు బంగారును కాను కలుగా సమర్పించిరి. ఆ దివ్యదశయంతయు తల్లికోటయుద్ధమునకు పూర్వదశయని చెప్పకయె చెప్పుచున్నది. అట్టి గుర్తింపు బహు ముఖ్యము. రామరాయల యుచ్చదశయే తిరుమలరాయల యుచ్చ దశకదా!

నాశనోన్ముఖముగా నడిచిన కర్ణాటసామ్రాజ్యమును రామ రాజు-

తే. గీ. అనఘతర పార్థివేందిర నభిగమించి
సాధుకర్ణాటవిభవ సంస్థాపనము

(వసు. 1-43)

చేసినాడు. 'సకలకర్ణాటకరక్షాధురంధరుఁడు రామవిభుఁడు' (హ. వ. 1-53) అయినాడు. అట్లు అతఁడు జీర్ణింపనున్న రాజ్యమును రక్షించి,

జీర్ణకర్ణాటసామ్రాజ్యోద్ధారకుఁ డనిపించుకొన్నాడు. ఆబిరుదునే అతని తమ్ముఁడైన తిరుమలరాయఁడు గూడ- జీర్ణకర్ణాటలక్ష్మీపునస్సృష్టి (వసు 1-13) కర్త, అఖిలకర్ణాటరాజ్యపునరుజ్జీవనుఁడు (వసు 1-14), కర్ణాటకాంధ్రధరణీపునరుద్ధారి (వసు 1-90) అనియు తగిలించుకొన్నాడు. అది అతనితోఁ బోలేదు. అతని కుమారుఁడు రంగరాయలను గుఱించి యిట్లు చెప్పఁబడినది-

తే. జీర్ణకర్ణాట భూపునర్జీవనుండు
రమ్యగుణశాలి, (శ్రీరంగరాయమౌళి.)రామరాజీయమున 244)

అది వంశపారంపర్యముగా వచ్చుచున్న బిరుదుమాత్రమె. అట్లు గ్రహింపకున్నచో, సత్యము మఱుగునపడిపోయి, కాలము విషయమై మోసపోయెదము. ఉదాహరణగా మఱియొక బిరుదును గుఱించి చూచెదము. చంద్రగిరిని పాలించుచున్న వెంకటరాయలకు[9] (1605) సకల హిందూరాజ్య సార్వభౌమయను బిరుదున్నది. పోచిరాజు నరసరాజు హిందూరాజ్యసంస్థాపకుఁడు. (నరస. 5-243) అట్టివి వెనుకటివారినుండి వచ్చుచున్న బిరుదులు మాత్రమె. ఈ బిరుదులలో మరియొక రకముగూడ నున్నది. ప్రధాన పరిపాలకుని బిరుదములను గొన్నిటిని సామంతులు ధరించు సంప్రదాయముగూడ నున్నది. ప్రధానపాలకుఁడైన సదాశివరాయలు చక్రవర్తికదా ! అతని బిరుదులనుగూడ తిరుమలరాయఁడు స్వేచ్ఛగా తగిలించుకొన్నాడు-

వీరప్రతాప రాజాధిరాజ, రాజపరమేశ్వర
......తిరుమలరాయశౌరి (వసు 1-13)
చాళుక్యనారాయణాంక (వసు 1-13)
వీరప్రతాప రాజాధిరాజ, రాజదేవేంద్ర,
తిరుమలరాయచంద్ర (వసు 1-62)
మన్నెవిభాళ (వసు 1-87).
(అట్టి బిరుదములె కొన్నిటిని నరసభూపాలీయములోగూడ జూచెదము)

---

9. శాసనపద్యమంజరి, 2 వ. భా. (ఆంధ్రసాహిత్యపరిషత్తు) పు 109.

అటువంటి బిరుదములను జూచి ఆరాజు సర్వస్వతంత్రుఁడనికాని, నిజముగా రాజాధిరాజనికాని, మోసపోరాదు. అట్లు మోసపోయినచో, కాలము విషయమైకూడ మోసపోయెదము. అట్టి బిరుదధారణ, వారికి కేంద్రపాలకుని మీఁదగల నిరాదరణను తెలుపుటయేకాక, దేశములో ఎవరికి వారే పెద్దలమని భావించుచుండి, సామ్రాజ్య విధ్వంసమునకు దారితీసిరని విశదముచేయును. ఆ బిరుదములను గుఱించి వజ్ఝలవారు- [10]"శాసనములలోని బిరుదములు కొన్ని విజయనగర రాజులకుఁ బరంపర్యాగతములును, మఱికొన్ని యళియరామరాజు వంశము వారికిఁ గులక్రమాగతములును నయి యున్నవనుటకు వీరిలో నెవరిని నిర్ణంచినను నీబిరుదులనే యుపయోగించుటయె నిదర్శనము. ఇట్లే కర్ణాటదాన శాసనములలోని "వీరప్రతాప రాజాధిరాజ పరమేశ్వరాది బిరుదములును వీరికిఁ బారంపర్యాగతములని గ్రహింపవలసియున్నది" అని స్పష్టపఱచినారు.

తళ్ళికోటయుద్ధసందర్భముగా నీ క్రింది రాజకీయకారణములు గనఁబడుచున్నవి. రాయని కాలమున మంత్రిమండలి యేర్పాటున్నట్లుగా కానవచ్చుట లేదు. అతడు నియంతయై వ్యవహరించెను. నవాబులు కలిసి తనమీఁదికి దండెత్తువఱకు నూరుకొనక, వారిలో కృతఘ్నుల నొకరిద్దరిని మొదటనే ధ్వంసముచేసి యుండవలసినది. తళ్ళికోటయుద్ధములో హిందువులు పిరికిపందలవలె వెనుకకు పరుగిడి తమ యోటమిని కొనితెచ్చుకొనిరి. [11]విజయనగర రాజులు విజయనగర కోటలోనికి వచ్చి, గవనులను బంధించి కూర్చున్నను, నవాబుల సేనలు నెలలకొలఁది వ్యర్థముగా ముట్టడించి, వెనుదిరిగి బోయియుందురు. విజయనగరకోటకు చేరినపిమ్మట తిరుమలరాయఁడు సైన్యములనుకూడ దీసుకొని, శత్రువుల నెదిరింపక, ధనమును మోసుకొని, పెనుగొండకు పారిపోవుటచేత, సామ్రాజ్యపునరుద్ధరణావకాశమును శాశ్వతముగాఁ బోగొట్టుకొన్నాఁడు. (సశేషము)

---

10. వసుచరిత్ర విమర్శనము (1915) పు 134.

11. విజయనగరచరిత్ర (ఆంగ్లము) కెంగుబూరు సూర్యనారాయణరాయ కృతము 1905 పుట 315 లో అధస్సూచిక.

తాపోపశమనము

విద్వాన్, శ్రీ గున్నేపల్లి అక్షయలింగకవి.

ఉ. ఏమని చెప్పనేర్తు హృదయేశ్వర! నా యవమానగాథ, నిం
కేమెయి నోర్తు డెందము దహించు మదీయవిషాదవహ్ని, నీ
పై మరు లుప్పతిల్లఁగ సభాస్థలి నెట్లొ నటించి నిర్జర
స్వామిప్రశంస లంది నిజసౌధముఁ జేరితి నంత నయ్యెడన్. 1

సీ. వనజాక్షి యొకతె సంపఁగినూనెఁ దలయంటి
తడియార్చి దువ్వి క్రొమ్ముడి ఘటించె
జిలుఁగువల్వలను గైసేసి యొక్కపొలంతి
కస్తూరికాతిలకమును దీర్చె
మగువ యొక్కతె మేన మంచిగంధ మలంది
మినుకుఁగాటుక వాలుఁగనుల దిద్దె
చెలి యోర్తు రత్నభూషల నలంకృతి సల్పి
హారమంజీరముల్ వ్యాలసరు లమర్చె

గీ. త్వరితగతి నివ్విధమ్మునఁ దరుణులెల్ల
మున్నె మామకాభీప్సితమ్మును గ్రహించి
విపులసౌందర్యవతిని గావింప నపుడు
ప్రియసఖిని గూడి నినుఁ జేరఁ బయనమైతి. 2

మ. అలకాపట్టణరమ్యహర్మ్యమున గాఢాశ్లేషసౌఖ్యోన్నతా
కలితుం జేయుకుతూహలమ్మునను మార్గన్యస్తవైరుద్ధ్యమున్
దలపఁన్ సుంతయు నంతఁ గొంతవడికిన్ ధాతాచలప్రాంతమం
దల లంకానగరాధినాయకుని సైన్యమ్మున్ విలోకించితిన్. 3

ఉ. దానవు; లాహవప్రియులు ధర్మవిదూరులు కాముకుల్ శఠుల్
కానఁ దదీయసేన కెడఁ గాఁ జన శ్రేయ మటంచు నెంచి, నం
దానది కవ్వలం దరులతాసుమశోభితమైన సుందరో
ద్యానవనమ్ముఁ జేరుటయు నందలిదృశ్యము లింపు నింపఁగన్. 4

కం. పులి పొంచియున్న పొదలోఁ
దెలియక చొరఁబాఱుహరిణి లెఱఁగున సకటా!
ఖలుఁడు దశాస్యుఁడు గల య
య్యెలదోటం జొచ్చి మిగుల నెల్లిద మైతిన్. 5

ఉ. అవ్వని నిర్గమించుసమయమ్మున రావణుఁ డేగుదెంచి నీ
వెవ్వతె; వెవ్వనిం గలియ; నెచ్చటి కేగెదు? నీరజాస్య! నీ
జవ్వన; మంగసౌష్ఠవము చక్కనిరూపవిలాసమై ఖరుల్
నవ్వులపాలు సేయక కళానిలయున్ ననుఁ గూడరాదటే! 6

గీ. హరిహరాదులనేనియు సరకుగొనని
శౌర్యగుణధుర్యుఁడను నాకు సాటి యెవరు?
రావణుం డండ్రు సకలరక్షోవిభుండ
సమ్మతింపవె నాపొందు జలజనయన! 7

గీ. నిండుజాబిల్లి పండువెన్నెలలు నింప
మలయపవనుండు కమ్మతావులు ఘటింప
మారుబారికిఁ జిక్కితి మనుపఁగదవె!
సందియంబేల ననుఁ గూడ సుందరాంగి! 8

కం. అని కేలువట్టి నిలిపినఁ
గను లశ్రులుగ్రమ్మ, మేను గడగడవడఁకన్
మన మెరియఁగ గొంతవడికి
ననునయమున నిట్టు లంటె వసురాధిపుతోన్. 9

కం. రంభ యనుదాన మరునిసంరంభమునకు
వశ్యులై యిట్లు మాటాడ భావ్యమగునె?
మీకుఁ గోడల నగుదు క్షమింపుఁ డయ్యా!
మానసీయులు మీకోర్కి మానుఁ డనిన. 10

కం. అకటా వికటపుమాటల
నెకసక్కెపువావు లెంచి యింతిరో! నన్నుం
గికురింతువ టే! నా సుతు
నకు సతి వౌదువటె! జగము నవ్వదె! విన్నన్. 11

కం. అని నన్నుఁ బరిహాసింపఁగ
ధనదుఁడు మీాయన్న యతనితనయుఁడు మీాకుం
దనయుఁడు నలకూబరుఁ డ
య్యనఘునిసతి నౌటఁ గోడ లగుదును గా దే! 12

చం. పరమపవిత్రమై వెలయు బ్రహ్మకులాన జనించి, ధర్మవి
స్ఫురితము లైనవేదముల పోడిమి నెల్ల గ్రహించి సత్క్రియా
పరతఁ బ్రసిద్ధి గాంచు మిమువంటి గుణాఢ్యులె వావి దప్పినన్
దురితమతుల్ జగమ్మున వధూహితతత్పరులై చరింతు రే! 13

కం. ఇత్తఱి భవత్తనూభవు
చిత్త మెలర్పంగఁ జనుదు సెలవిండు కృపా
యత్తమతి నంచు వేడిన
నత్తులువ సహింప కిట్టు లనియెం బెలుచన్. 14

ఉ. అన్నయుఁ దమ్ముఁడున్ మఱియు నల్లుఁడు మామయు నేమికావలెన్
జన్నము చేసియుండు నెడ, సంగరరంగమునం బరాక్రమా
భ్యున్నతిఁ జూపి త్రెళ్లునెడఁ బుత్త్రుఁడుఁ దండ్రియు నేమికావలెన్
వన్నద వేల! యిట్టిపెడవావులు నన్నుఁ జలింపఁ జేయునే! 15

కం. అని పలికి నన్ను సాహస
మున నొకపొదరింటఁ జేర్చి భోగింపఁగ న
ద్దనుజాధము మొఱకుఁదనము
గనియును జీవింతు నెట్టికర్మఫలంబో! 16

ఆ. వె. వానిపలన ముప్పు వాటిల్లుటకు మున్నె
మిత్తిమొగమునందుఁ జొత్తు నన్నఁ

గమలభవుఁ, డమర్త్యకాంతగాఁ సృజియించె
విధివిధాన మనుభవింపవలదె? 17

కం. నగభేదిపట్టణముపైఁ
బగగొను నెఱజోదువలనఁ బ్రాపించిన నా
యగచాట్లు దెలిపి నీమది
నొగిలించుట కెంతయును మనోహర! వగతున్. 18

కం. అని యిమ్మెయిఁ జింతిలు రం
భను గని నలకూబరుండు బాష్పకణమ్ముల్
తన కేలఁ దుడిచి దానవు
ననుచితకృత్యముల; కాగ్రహాన్వితుఁ డగుచున్. 19

కం. దోయిటఁ బవిత్రగంగా
తోయమును గ్రహించి దోషదూషితుఁ డగుదై
తేయవిభుఁ డన్యకాంతల
చాయకుఁ జనకుండ నవుడు శపియించె నిటుల్. 20

కం. "ఒడఁబడని యట్టిపడఁతిని
బొడగని యీ రీతి నెడరు పొనరించిన ని
వ్వెడఁగుతలల్ పోడిమి సెడి
పుడమిం బడుఁగాక! వేయిముక్కలుగ వడిన్. 21

కం. అని శపియింపఁగ వనితా
జన మెల్లఁ బ్రశాంతి నందె సంతృప్తమతిన్
విని మాన మూనె రావణుఁ
డనిమిషఘనకుసుమవర్ష మంతటఁ గురిసెన్. 22

కం. ఈ పగిది దనుజనాథుని
శాపించి కుబేరసుతుఁడు సముచితమధురా
లాపమ్ముల రంభా తా
పోపశమన మాచరించి యూఱటఁ గనియెన్. 23

సిరి:-సత్యమే తండ్రీ! తాతగారి పలుకులలో నసృతముండునా?

చి. మా-(నవ్వుచు) అట్లైన తాతగారూ! నేటినుంటి నాయుద్యమము విరమించుకొని హాయిగ సహస్రగాయత్రి జపించుకొనుచు విశ్రాంతి గైకొందును. బాధ్యత గల ప్రభుకుమారుడే తనకర్తవ్యము నెరవేర్చుకొనుట ముదావహము. సత్త్వగుణ మలవరచుకొనవలసిన నాకీ వృథాశ్రమ మేల?

వృ. మా:-అబ్బా! ఎంతటిదురాశ! ఆంధ్రదేశము నావదనుండి తొలగించుగౌరవము, కీర్తియు నీకొక్కనికే దక్కవలయునా? ఆతనికి నీవుగూడ కాసంత చేయూత నొసగరాదా యేమి?

చి. మా:-(నగుచు) బ్రాహ్మణయువకుడు సంపాదించి యొసగిన రాజ్యమును ప్రభుకుమారుడు స్వీకరింపడేమో యనుసందియము తాతగారూ!

వృ. మా:-(సపరిహాసముగ) నీ కట్టిసందియములో బనిలేదు తాతా! భూమికి కాశ్యపి యనుపే రెట్లు కల్గినది? మున్ను కశ్యపుడను విప్రుడు పరశురామదత్తమగుభూమండలమును మఱల క్షత్రియుల కొసంగెనని నీకు తెలియకున్నదా? బ్రాహ్మణునిగ నున్న నీవు రాజ్యమును సంపాదింపుము. బహిర్గతుడైనపిదప సోమదేవసుతు డద్దాని పాలించును.

చి. మా:-ఎంత చమత్కారముగ ప్రసంగించుచున్నారు తాతగారూ!

(నే పథ్యమున)

"అమ్మాయీ! నీ వచటనే యుంటివి గాబోలును. మీ నాన్నగారి కొఱ కెవ్వరో వచ్చియున్నా రని చెప్పుము."

వృ. మా:-(విని) ఇది శుభసూచికసమయము తాతా! లే లెమ్మ. నీ సందియము లన్నియు దీరుసమయము సమీపించినది. ఆ వచ్చిన వారు ప్రతాపవర్మగారే యైయుండవచ్చును. ఇపుడే నీకు వారితో

బరిచితి గావించెదను రమ్ము. ఆయన యాంధ్రసుహాభిమాని. వారి తోడిమైత్రి నీకు ముఖ్యము.

చి. మా:-(లేచి వృద్ధమాధవశర్మతో గూడి నిష్క్రమించును.)

సిరి:—దేవా! సిద్ధేశ్వరస్వామీ! నీవు కరుణించుసమయ మేతెంచినది మహాత్మా!

(తెర జారును)

ఆంధ్రదీక్ష

ద్వితీయాంకము-ద్వితీయ రంగము

ప్రదేశము:-కందారపురమున భీమణవర్మగారి పూలతోట.

ప్రవేశము:-చెన్నబసవడు (ఒక వేదికపై)

చెన్న:-(తనలో) అయ్యో!నాకర్మమే యీ లాగున కాలిపోవలయునా? ఎంద తెన్నిదివాణములలో పనిచేయుటలేదు. ఆబోతు నంటిపట్టు కొనిన జోరీగవలె నయ్యగారిని రేయింబవళ్లు విడువకుండ దిరుగు చుంటచే బెస్తావాడు మొదలుకొని పెద్ద యుద్యోగివఱకు మన మనిన గడగడలాడువారే. కాని యేమి లాభము? ఇంతటి గొప్ప తనమును నిల్లాలికడ గడ్డిపోచకైన మారకుండ బోయిన దే! "నాగ రాజుబాబుతోడనే కలకాలము కాపుర మేడువదలచుకొనిన గాడిదకొడుకవు న న్నిందులకు గట్టుకొంటి వని యది యు దేవనిగ రాజవీధిలో బడి ఱంకెలు వేయుచున్నది. నే నేమి చేయవలసినది?

(సోమశేఖరశర్మ ప్రవేశించుచున్నాడు.)

సోమ:-ఏమిరా! చెన్నా! ఏడుపుమొగముతో నున్నా వేమి?

చెన్న:-ఏ మున్నది బాబూ! మా యింటిదానిగోల యెక్కువైనది.

పడుచుదన మంతయు బాబుతోనే వెళ్ళబుచ్చునపుడు త్రాడు గట్టించుకొనినది తందనాలు తొక్కిన దనిన తి ప్పేమున్నది. మీా కేమి ? మీా రదృష్టవంతులు. రాతిరి తొమ్మిది గాకుండగనే తోక జాడించుకొని గూటికి జేరుకొని గువ్వపిట్టవలె నమ్మగారితో నా పలుకే పలు కాడుచు హాయిగ నుందురు. ఇక నాకా! ఇల్లు లేదు. ఇల్లాలిమాట లేదు. సంసారము లేదు-

సోమ:-(నవ్వుచు) ఊ- కానీరా! కట్టుకొనినదానికి కడుపువచ్చినట్లు కలగూడ లేదు. పురిటికి వ్యయము లేదు. పిల్లలతో పీకులాట లేదు-

చెన్న:-బాబూ! మీా కేమి ? నా బ్రదుకంతయు నవ్వులాటగనే యుండును- నారాయణమూర్తీ! నా పగవానికైన నా పాట్లు వలదు.

సోమ:-పోరా! నీ శీతమ్మశోకమున కేమిగాని నాగరాజుబా బిపు డెచట నున్నాడురా!

చెన్న:-ఏమో బాబూ! ఎవ్వరు చెప్పగలరు? పచ్చిపెసలు బడవేయుచు పావురములకడనో- పెద్ద తెరపెట్టెలగ్రుడ్ల నణకించుచునో- మిడు తల జంపి పిగిలిపిట్టలనోటి కందిచ్చుచునో- కొంజులకొఱకు చెద గుట్టల ద్రవ్వించుచునో- జాగిలముల బట్టినకొంఖునుల తమచేతు లతో నూడలాగుచునో-జెట్టిపుంజుల యూరుల జెక్కుచునో-ఏది యో పెద్దపనిలో మునిగి కొట్టుకొనుచు నుందురు! మ జేమున్నది?

సోమ:-(నగుచు) నీ మహోపన్యాసము మండిపోను! ఎంత దండక మేక రువు పెట్టినావురా! చెన్నా! ఇటు విను - పెండ్లికూతురుగారి యర ణపుదాసిముండ వచ్చి "అమ్మగారు రమ్మనుచున్నా"రని యాయ నను లాగుకొని పోయిన దని వింటిని- నిజమేనా!

చెన్న:-(నవ్వుచు) ఆరేండ్లయి యత్తవారింటికి కాపురమునకై వచ్చి యీా యాడంగియయ్యవారితో నింకను కాపురము చేయుటకు

గంపెడాస బెట్టుకొనిన యీ యమ్మ యమాయికత్వమును, నాగరాజుబాబునకు సంసారము మవ్వటకై మువ్వత్రిప్పల బడి మూడు చెరువులనీళ్ళు దాగుచున్న మీ పట్టుదలను- జూచిన నేను నవ్వవలయునో- యేడువవలయునో తెలియుట లేదు బాబూ!

సోమ:-ఔనురా! చెన్నా! నీ వేలాగునైనను పెంకిముండకొడుకవు. బాగుగ గనిపెట్టితివి. ఇంతకును నా కుమారవర్మగారి కొమరిత దురదృష్టవంతురాలు. దైవఘటన యట్లున్నది. (ఆలోచించి) అబ్బా! కళాశాస్త్ర మంతయు గడగడ కలలోగూడ నప్పగించునట్లు కంఠస్థము జేయించితిని. ఎన్నియో శృంగారకావ్యముల వల్లెవేయించితిని. తుదకు సిగ్గు విడిచి కోటలోని పడుచుదాసిముండల బిలిపించి వారికి జెప్పవలసినది చెప్పి యీ యయ్యగారిపై నుసిగొల్పితిని. ఊః హూః చలనము లేదు- పులకింపు లేదు- ఏమి లాభము? మిడుతల బట్టుకొనుటలో గలనేరుపు పడతి పైటచెఱగు బట్టుటలో బట్టువడ లేదే- పావురముల బల్లటీల బరికించుటలో గల యేకాగ్రత మాలియాంగికసందర్శనములో సహస్రాంశ మైనను లేదే-పిగిలిపిట్టపింఛము సవరించుటలో నలవడినప్రజ్ఞ పెండ్లికూతురుగారి కుంతలముల గుదురుపరచుటలో గుదర లేదే- ఆకుల జెక్కుటలోగల యాసక్తి యమ్మగారి యధరము నొక్కుటలో లేదే- ఇట్టి యీడంగియవకతవకయయ్యతో- నిట్టి వట్టిబట్టలబండారపు గుమ్మటముతో- నేమేమో సుఖింతు నని యీ యమ్మ యాంతరంగికపరిచారికచే రహస్యవార్తల నంపినదా? ఏమో- మనసు తిరిగినదేమో- గరగసాలలేహ్యము కాసంత పట్టిచ్చినదేమో!

(నాగరాజు కూనరాగముతో బ్రవేశించును.)

నాగ:-ఇదిగో! శర్మా! వచ్చితివా ?

సోమ:-ఆః ఏలినవారి యానతికి దిరుగున్నదా? (నగుచు) ఈ దినమున బాబుగా రమ్మగారిసన్నిధికి వేంచేసినటు లున్నదే.

నాగ:—ఓ యబ్బ! నీవు నిన్న బోధించినపాఠ మింతలోనే పరాకుపడితి మనుకొంటివా? లేదు— లేదు— ఇది యింతటితో గదలుఘటము గాదు— మా సంగతి నీ వింకను జిత్తగింపలేదు.

సోమ:—ఇది యేమి బాబూ! పెండ్లికూతురుగారి పిలుపు బెడచెవిని బెట్టు డని నే బోధించితినా?

నాగ:—కా దయ్యా! బుద్ధిగలవానికి బోధ లెందులకు? నిన్నటిదినమున మనము చదివిన కావ్యములోని ప్రణయకలహమును నేను మేమాచరణములో బెట్టితిమి. ప్రభువులము గనుక పెండ్లికూతురుగారి పైననే ప్రయోగించి చూచితిమి

సోమ:—ఓయి దేవుడా! అదియా బాబూ! ప్రణయకలహ మనగా నా గదిలో— నా శయ్యపై—నటుదెస నమ్మగారు— నిటువైపు మీరును శయనించి యున్నపు డా పరిస్థితిలో— నాలుమగలలో నెవ్వరో యొక్కరు— ఏదో గోరంత లేనిపోని విషయమును గొండంతగ జేసికొని యటు నామె— యిటు మీరు, కాసంత నెడపెడ మొగములు జేసికొని యంతలోనే...

నాగ:—(విసుగుతో) అదియే నయ్యా! మా శరము గాకపోలేదు. గడి—శయ్య యని సపాదలక్షగ్రంథము జదివెద వెందులకు? అంత గొడవ యక్కర లేకుండగనే వ్యవహారపరిష్కారము గావించి యిట్లు నిర్విచారముగ భీష్మించుకొని కూర్చుంటిమి. ఇంతవఱ కా గదివైపు కాలైన సాగినదేమో చెన్నడి నడుగుము శర్మా! (చెన్నబసవని గని) ఏమిరా? అటు లేడుపు మొగముతో నుంటి వేమి?

చెన్న:—చిత్తము బాబూ! ఏలినవారి కా దృష్టియే లేదు. పదిమంది నాటిన తోటలోనుండి మనవి చేయుచున్నాడను.

నాగ:—వింటివా? శర్మా! ఇంత యెందులకు? మా నడుమ రాయబారముల గడుపుట కా పాడుతొత్తుకూతురు నంపుట యెందులకు?

ఆమెయే స్వయముగ దయచేసి యిచ్చుకొని పోజూచినను నీడిగిల బడుదుమే కాని యింటిలోని కేగుదుమా? ప్రభువుల పట్టుదల లంతే- రాచపగ, త్రాచుపగ యనినారు.

సోమ:-(తనలో) రామ! రామా! ఈ నిర్భాగ్యున కెంతగ బోధించి నను విపరీతముగ పరిణమించుచున్నది. క్రమముగ నా బోధలు తల కెక్కి యేదియో పనికి వచ్చు ననుకొంటిని. ఈ రీతిగ కథ యడ్డముగ దిరిగిన దేమి? ఇట్లు వెఱ్ఱిపట్టుదలతో నీతడు కాలు లోన బెట్టకున్న నెల్లరు నీ పాపపుబండిని నాపై దోలుదురు గదా! నాకు దేవిడీమన్నా తప్పదు. ఆంధ్రదేశోద్యమమున కావం తయు నుపకరింపకుందునే! మాధవశర్మగారి మన్ననల కావంతయు బాత్రుడ గాకుందునే! (ప్రకాశముగ) బాబూ! ప్రణయకలహ మనగా తెగువటకు దెగించుట గాదు. ప్రణయకోపము ప్రళయ కోపము జేయవచ్చునా? ఎన్నిప్రబంధము లేలినవారు చిత్తగింప లేదు. వానిలో పట్టు- విడుపు పఠింపలేదా? కావున-

నాగ:-ఆగుము శర్మా! ఆగుము. అట్లనుచుంటివి గదా. ప్రవరాఖ్యు డను పేరుగలబ్రాహ్మణు, డదునుచేసిన డేగవలె రెపరెపలాడుచు మీాదకు వచ్చినవరూథినిని త్రోసివైచి పారిపో లేదా! ఈ విష యము నిన్న మధ్యాహ్నము మనము మార్కండేయపురాణములో చదివితిమా? లేదా? ఆ చచ్చుబాపనిపాటి శౌర్యము మాకు లేదను కొంటివా? మా మాటకు మారు చెప్పకుము- అంతే-

సోమ:-చిత్తము- చిత్తము- శ్రీవారిపలుకులు శిలాక్షరములు. ఈపూట పాఠ మేమిటి బాబూ!

నాగ:-పాఠముల కేమిగాని శర్మా! ఒక్కసందేహము సెల వీయ దలచుకొంటిని.

సోమ:-చిత్తము.

నాగ:-మనువు- మాంధాత మొదలుకొని మదనకామరాజు వఱకును గల మహారాజుల నందఱను మన్మథుడు ఏటిరింతవలె నెగిరి యెగిరి తన్ని గిజగిజలాడించినాడు గదా! మనల నేమియు జేయలేక పోయినా డేమి?

సోమ:-చేయలేకేమి? బాబూ! సమయ మింకను రాలే దన్నమాట.

నాగ:-ఛస్- ఏమి చేతగానిమాట సెలవిచ్చితి వోయి! శర్మా! మన బింకము నీ వింకను గనిపెట్టలే దనుమాట. తోలుచేయి దొడుగు కొనకుండగనే సాళువాడేగను ముంజేతిమండమీద యెక్కించుకొని తిరుగుమనము- మూ డంగుళముల యారుదెబ్బకు లక్ష్యము సేయనిమనము- కొజుపిట్ట ముట్టెపోటునకు కనుబొమ్మలైన జిట్లింపని మనము- ఈ చచ్చుగాడిదకొడుకు మన్మథుడు పువ్వులు రువ్విన బెదరుదుమా? వెఱ్ఱిమాట! కొక్కురో-కో యని గొంతుకచించుకొని గూబపగులునట్లు కోడిపుంజు కూసినను జంకనిమనము- గుప్పెడుకోయిలపిల్ల కూతకు కుఱింగిపోవుదుమా? ఏమిరా! చెన్నా! బండిపులుగువలె నట్లు చూచెద వేమిరా? మాటాడ వేమి?

చెన్న:-అంతే బాబూ! అంతే.

సోమ:-బాబుగారు- పెండ్లికూతురుగారి రాయబారమున కేమి ప్రత్యుత్తర మిప్పించినారో?

నాగ:-ఏ మున్నది? ఒక్కటే మాట. మేము ప్రస్తుతము ప్రణయకలహములో బ్రవేశించితిమి. ఈ దీక్ష నీ జన్మములో విడువ మని. తెలిసినదా? చెన్నిగా! మూగముండకొడుకా! ఎటు లున్నదిరా? ఏలినవారి సమాధానము.

చెన్న:-బాబూ! చదువు రానివాడను. ఏమి సెలవిచ్చితిరో తెలియదు.

నాగ:-(సంతోషముగ) ఆఁ ఆఁ ఆ మాటలోనే మేము చదువు గలవార మనునర్థ మున్నది. శర్మా! అంతేనా? మా సేవకుడవైన నందులకు మంచిమాట వదలితివిరా? గడుసుముండకొడుకా!

సోమ:-హరీ యనువఱకును ప్రభువువారీ పట్టుదల వీడనిచో మన యయ్యగారు- మఱి- మనుమల ముద్దుబెట్టుకొనుట యెట్లు బాబూ!

నాగ:-నేను వల దంటినటోయి! శర్మా! మనుమలనే కాదు- మునిమనుమలను గూడ ముద్దు పెట్టుకొన మన యభ్యంతర మేమి?

సోమ:-అది యెట్లు బాబూ! అమ్మగారికి నెల తప్పినపుడుగదా! అంత భాగ్యము.

నాగ:-అమ్మగారికి నెల తప్పకుండ మనయుద్దేమున్నదోయి!

సోమ:-చిత్తము. ఏలినవారు. గదిలో కాలు పెట్టినపుడు గదా అమ్మగారికి-

నాగ:-ఏడిచినట్లే యున్నది. నీ తెలివి. చూడు శర్మా! మనము గదిలో నడుగిడనంతమాత్రమున లోకములోనివారు గర్భవతులు గాక పోవుచున్నారా? అటు సృష్టి నాపెద మనుకొంటివా?

సోమ:-(తనలో) అయ్యో! ఈ పాపాత్ము డింట నున్నయిల్లాలినిగూడ నడివీధి కెక్కించుచున్నాడే. వీనిని గదుపుట యా సాధ్విని మానభంగ మొనర్చుటయే- ఛీ- ఛీ.

నాగ:-చెన్నా! వచ్చినపని పరాకుపడితిమి రా! మన వేటగాడీయుదయమున ముడికొండమెట్టమీద మంచి కణుసును కొట్టి పట్టించుకొని వచ్చినాడురా! సువారములో నున్నది చూడు. పెద్ద జీవములే- రారా! శర్మా! నీవుకూడ వచ్చి చూచెదవా?

సోమ:-అభ్యంతరము లేదు బాబూ! అయ్యగా రెండులకో నాకు కబు రంపినారు. వారిని దరిసించి వచ్చెదను.

